విరబూస్తున్న కాలీఫ్లవర్

- 90 రోజుల్లో పంట దిగుబడి
- పెరిగిన పెట్టుబడి వ్యయం
- నియోజకవర్గంలో 800 ఎకరాల్లో సాగు
- ఇతర ప్రాంతాలకు ఎగుమతి

తాళ్లపూడి: తక్కువ సమయంలో దిగుబడి వచ్చే సీజనల్ పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి పంటల్లో కాలీఫ్లవర్ ఒకటి. ఇటీవల ఈ పంట సాగు పెట్టుబడి బాగా పెరిగింది. అయినప్పటికీ తక్కువ సమయంలో దిగుబడి వచ్చేది కావడంతో ఈ ప్రాంత రైతులు సాగుకు వెనుకాడడం లేదు. కాలీఫ్లవర్ సాగుకు నియోజకవర్గంలోని నేలలు అనుకూలం. తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు మండలాల రైతులు అంతర పంటగా కూడా కాలీఫ్లవర్ సాగు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఏటా సెప్టెంబర్ రెండో వారం నుంచి కాలీఫ్లవర్ వేస్తారు. ఇది అక్టోబర్ నెలాఖరు నుంచి నవంబర్ మొదటి వారం వరకూ విక్రయానికి సిద్ధమవుతుంది. ఈ పంటకు మార్కెట్‌లో ధర కూడా బాగానే ఉంటుంది. తాళ్లపూడి మండలంలోని రావూరుపాడు, మలకపల్లి, పెద్దేవం, బల్లిపాడు, కొవ్వూరు మండలంలోని దొమ్మేరు, పెనకనమెట్ట సావరం, కాపవరం, చిడిపి గ్రామాల్లోను, చాగల్లు మండలంలోని పలు గ్రామాల్లోనూ రైతులు విస్తారంగా కాలీఫ్లవర్ సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలోని దాదాపు 800 ఎకరాల విస్తీర్ణంలో కాలీ ఫ్లవర్ సాగవుతోంది. ఇక పొరుగునే ఉన్న నిడదవోలు, దేవరపల్లి మండలాల్లో 17 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని కాలీఫ్లవర్ పంట పెరిగే దశలో ఉంది.

సాగు ఇలా..

ఎకరం పొలంలో కాలీఫ్లవర్ సాగుకు రూ.35వేల నుంచి రూ.45వేల వరకూ పెట్టుబడి అవుతుంది.




తాళ్లపూడి మండలం రావూరుపాడులో సాగు చేస్తున్న కాలీఫ్లవర్

పొలం కౌలు రూ.35 వేల నుంచి రూ.40 వేలు అదనం. 90 రోజుల వ్యవధిలోనే పంట కోతకు వస్తుంది. కాలీఫ్లవర్ సాగుకు ఈ ప్రాంత రైతులు ముందుగానే పొలంలో పశువుల ఎరువు వేసి దుక్కి దున్ని నేలను సిద్ధం చేస్తారు. ఈ ప్రాంతంలో ప్రధానంగా స్టార్-9, గోదావరి 86, కార్తీ స్పెషల్, బుల్లెట్, అవతార్ అనే వంగడాలతో పాటు ఇతర హైబ్రిడ్ రకాలను కూడా సాగు చేస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో కాలీఫ్లవర్ సాగుకు 250 గ్రాముల విత్తనాలు అవసరం అవుతాయి. ముందుగా నారుకట్టి 30 రోజుల తరువాత తయారైన నారును విత్తుకోవాలి.ఎకరా విస్తీర్ణంలో 11 వేల నుంచి 14 వేల వరకూ మొక్కలు నాటాలి.

అంతర పంటగా..

కొందరు రైతులు కాలీఫ్లవర్‌ను అంతర పంటగా వేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రధానంగా అరటి, మిరప పంటల్లో సాగు చేస్తున్నారు. కాలీఫ్లవర్ వేసిన 15 రోజుల వ్యవధిలో కూర మిరపను అంతర పంటగా వేస్తున్నారు. దీని వల్ల కాలీఫ్లవర్ పంట పూర్తయ్యే సమయానికి మిరప పంట కాపు ప్రారంభం అవుతుందని రైతులు అంటున్నారు. మిరపలో అంతర పంటగా కాలీఫ్లవర్ సాగు చేయడం వల్ల కాలీఫ్లవర్‌కు వేసిన ఎరువులు, పురుగు మందులు మిరప పంటకు కూడా ఉపయోగపడి పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని వారు చెబుతున్నారు.



తయారవుతున్న కాలీఫ్లవర్

ఇతర ప్రాంతాలకు ఎగుమతి...

కొవ్వూరు నియోజకవర్గంలో ఉత్పత్తి అయ్యే కాలీఫ్లవర్ పంటను ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని ప్రధాన మార్కెట్లతో పాటు రాజమహేంద్రవరం, వైజాగ్, చెన్నైలకు ఇక్కడి రైతులు ఎగుమతి చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి కాలీఫ్లవర్ వస్తోంది. వాతావరణంలో మార్పుల కారణంగా సస్యరక్షణ చర్యలకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ఫిబ్రవరి నెలాఖరు కాలీఫ్లవర్ తోటలు ఉంటాయి. గతంలో కంటే పెట్టుబడులు పెరిగాయని రైతులు చెబుతున్నారు. అదే సమయంలో మార్కెట్లో ఆశాజనకమైన ధర ఎన్నిరోజులు ఉంటుందో చెప్పలేమంటున్నారు. మొదట్లో ఒక్కో కాలీఫ్లవర్ రూ.15 నుంచి రూ.10 పలికినప్పటికీ, తర్వాత రూ.5 నుంచి రూ.6 కు పతనమైన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో రైతులు నష్టపోగా దళారులు మాత్రం లాభపడుతున్నారు.

ఇక్కడి నేలలు అనుకూలం



ఈ ప్రాంత నేలలు కాలీఫ్లవర్ సాగుకు అనుకూలం. తాళ్లపూడి, కొవ్వూరు, పెరవలి, చాగల్లు మండలాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. అధికారుల సూచనల మేరకు మాత్రమే కాలీఫ్లవర్ సాగుకు ఎరువులు, పరుగుమందులు వాడాలి. పురుగు మందులు అధికంగా పిచికారీ చేయరాదు.

– సీహెచ్ శ్రీనివాస్, హార్టికల్చర్ ఏడీ, కొవ్వూరు

క్లుప్తంగా

భవానీ మాలధారులకు అన్నదానం



నల్లజర్లలో భవానీ మాలధారులకు అన్నదానం చేస్తున్న భక్త బృందం

నల్లజర్ల: శరన్నవరాత్రుల సందర్భంగా భవానీ మాల దీక్షాధారులకు నల్లజర్ల పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో భోజన ఏర్పాట్లు చేసినట్టు భక్త బృందం తెలిపింది. శని, ఆది, సోమవారాల్లో రోజుకు 600 మందికి భోజనం ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం నుంచి 1000 మందికి ఇక్కడ భోజన ఏర్పాట్లు చేస్తున్నట్టు భక్త బృందం తెలిపింది. పాదయాత్రగా వెళ్లే భక్తులకు కాసేపు విడిది ఏర్పాట్లు, సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకునే విధంగా ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు ఆళ్ల రమేష్, వెదుళ్ళ రామకృష్ణ, పాతూరి పాపారావు, సవలం రామకృష్ణ, కొత్తపల్లి నాగేశ్వరరావు, వల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

రేపు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొవ్వూరు: మండలంలోని కాపవరం రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈనెల తొమ్మిదో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభిస్తారని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి.రాధిక తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొంటారన్నారు.

శ్యామలాదేవికి డొక్కా సీతమ్మ అవార్డు



కాకినాడ నగరంలో అవార్డు అందుకుంటున్న శ్యామలాదేవి

దేవరపల్లి: అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ 183వ జయంతిని పురస్కరించుకుని వర్ణదార ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పలు సేవా సంస్థల నిర్వాహకులకు అవార్డులు ప్రదానం చేశారు. దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ వయోవృద్ధుల ఆశ్రమం నిర్వాహకురాలు జి.శ్యామలాదేవి కూడా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కాకినాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ చేతుల మీదుగా శ్యామలాదేవి ఈ అవార్డు స్వీకరించారు. కార్యక్రమంలో డొక్కా సీతమ్మ ఐదో తరం వారసుడు డొక్కా భీమ వెంకటసత్య కామేశ్వరరావు, వర్ణదార ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ ప్రారంభం



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

కొవ్వూరు: రాజమహేంద్రవరం – జంగారెడ్డిగూడెం నడిచే ఆర్టీసీ కొత్త అద్దె బస్సు సర్వీసును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం కొవ్వూరులో జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీసీ బస్సును పూలమాలలతో సుందరంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించాక ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి బస్సు సర్వీసును ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, డిపో మేనేజర్ వైవీఎస్ కుమార్, నాయకులు ఆళ్ల హరిబాబు,దాయిన రామకృష్ణ,పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్
- తాళ్లపూడి స్టేషన్‌లో వార్షిక తనిఖీ

తాళ్లపూడి: గ్రామాల్లోని పరిస్థితులపై స్థానిక మహిళా పోలీసులు అవగాహన కలిగి ఉండడమే గాకుండా, అప్రమత్తంగా కూడా ఉండాలని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఆయన తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. తొలుత మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో ఎలాంటి ముఖ్యమైన పరిణామం జరిగినా తక్షణమే ఎస్సై దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సాధారణ బదిలీల తరువాత సిబ్బంది కొరత ఉన్న పోలీసు స్టేషన్లలో భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం డీఎస్పీ దేవకుమార్ తాళ్లపూడి స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు,



తాళ్లపూడి స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహిస్తున్న డీఎస్పీ దేవకుమార్

రికార్డుల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తాళ్లపూడి మెయిన్‌రోడ్‌లో ట్రాఫిక్ సమస్య, ఆక్రమణల గురించి విలేకరులు ప్రస్తావించగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ, కొవ్వూరు రూరల్ సీఐ బి.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు మారాలి

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మరడాని రాము
- అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కొవ్వూరు: మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు తమ వృత్తిని మార్చుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మరడాని రాము సూచించారు. జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సమావేశం ఆదివారం రాత్రి కొవ్వూరులో జరిగింది. ఏలూరు జిల్లా కార్యదర్శి కుమ్మర వెంకటరమణరావు (చిన్ని) మాట్లాడుతూ తెలంగాణ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ద్వారా చాలామంది ఫొటోగ్రాఫర్స్‌కు మేలు చేకూరుస్తున్నామన్నారు. త్వరలో నిర్వహించే రాష్ట్ర సంఘ ఎన్నికల్లో కుటుంబ భరోసా పథకాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు షేక్ షాబీర్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్ సమస్యలను ఏపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా గెల్లా రాజబాబు

ఫొటో, వీడియోగ్రాఫర్స్ జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా పోకల రవిని ఎన్ను కున్నారు.అధ్యక్షుడిగా గెల్లా రాజబాబు, ఉపాధ్యక్షులుగా డి.మహేష్, పసలపూడి ఆశీర్వాదం, కె.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సిరాజ్, సంయుక్త కార్యదర్శులుగా బి.నాగు, ఎం.కార్తీక్ కోశాధికారిగా సిర్రా సూర్య, సహాయ కోశాధికారిగా బి.స్వరాజ్, పీఆర్‌వోగా ఏనుగుల బాలు, సలహాదారులుగా గేలం వెంకటేశ్వరరావు, నరసింహులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా గోవా ప్రసాద్, డి. వేణుగోపాల్‌రెడ్డి, కె.నాగసాయి, డి.శ్రీనివాస్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.



కొవ్వూరులో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

తాగునీటిగా గోదావరి జలాలు అందించాలి

అధికారుల సమావేశంలో ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: మండలం పూర్తిగా మెట్ట ప్రాంతంలో ఉన్నందున మండలంలోని గ్రామాలకు వాటర్ గ్రిడ్ ద్వారా గోదావరి జలాలను సరఫరా చేయాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ మంచినీటి మోటార్ల నిర్వహణ, మరమ్మతులకు మెట్ట ప్రాంత పంచాయతీలపై ఏటా రూ.కోట్లలో భారం పడుతోందన్నారు. అయినప్పటికీ శుద్ధి చేసిన మంచి నీటిని ప్రజలకు సరఫరా చేయలేకపోతున్నారని తెలిపారు. బోరు నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్నందున తాగేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అందుచేత గోదావరి జలాలను అందించే 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో దేవరపల్లి మండలాన్ని కూడా చేర్చాలని ఆయన అధికారులకు సూచించారు. ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమైనందున రైతుల వద్ద గల ధాన్యాన్ని సకాలంలో గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ఎంపీపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ ఉండాలని, నాణ్యమైన భోజనం వారికి అందించాలని ఆయన విద్యాశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారి చిలకా వెంకట్రావు, వ్యవసాయాధికారి కె. విజయ్, ఎంఈఓ ఎం. తిరుమలదాస్, గృహనిర్మాణ శాఖ ఏఈ ధర్మారావు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

ఈఓపీఆర్డీగా రాజారావు బాధ్యతల స్వీకరణ

దేవరపల్లి: మండల పంచాయతీల విస్తరణాధికారి (ఈఓపీఆర్డీ)గా వై.రాజారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఈఓపీఆర్డీగా పని చేసిన పి.ప్రభాకరరావు ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో గన్నవరం నుంచి రాజారావు నియమితులయ్యారు. రాజారావును మండలంలోని పంచాయతీల కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నిట్టా రవికుమార్, ఎ.అమ్మిరాజు, సి. రామచంద్రరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు వెలుగు ఏపీఎం గా శ్రీనివాస్

చాగల్లు: మండల వెలుగు ఏపీఎంగా ఈదూరి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా దేవరపల్లి మండలం నుంచి బదిలీపై శ్రీనివాస్ చాగల్లు వచ్చారు. ఇప్పటి వరకు ఏపీఎంగా పని చేసిన మంగాయమ్మ తాళ్లపూడి ఏపీఎంగా బదిలీపై వెళ్లారు.



ఈఓపీఆర్డీ రాజారావును మర్యాద పూర్వకంగా కలసిన కార్యదర్శులు

నిడదవోలు వెలుగు ఏపీఎంగా మహాలక్ష్మి

నిడదవోలు రూరల్: నిడదవోలు మండల వెలుగు ఏపీఎంగా ఈదూరి మహాలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీతానగరం మండల ఏపీఎంగా పని చేసిన మహాలక్ష్మి బదిలీపై రాగా, ఇక్కడ పనిచేసిన ఈ.శ్యామ్‌సుందర్ నల్లజర్ల మండలానికి బదిలీపై వెళ్లారు. ఏపీఎం మహాలక్ష్మిని డ్వాక్రా సిబ్బంది అభినందించారు.

కోట సత్తెమ్మ సన్నిధిలో కుంకుమ పూజలు

నిడదవోలు రూరల్: శరన్నవరాత్ర ఉత్సవాల ఐదో రోజైన సోమవారం మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారిని వేలాదిగా భక్తులు దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవారికి ఆలయ ప్రాంగణంలో 280 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణ,హోమాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలతో పుష్పాలంకరణ చేశారు. దాతల తోడ్పాటుతో భక్తులకు చక్కెర పొంగలి, దేవస్థానం ఆధ్వర్యంలో పులిహోర ప్రసాద వితరణ చేశారు.అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,37,970 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాశ్ చెప్పారు. గోపవరం గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలో పుంతలో ముసలమ్మ ఆలయాల వద్ద భక్తులు అమ్మవార్లను దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు.



అమ్మవారి అలంకారం

మహా చండీదేవిగా దుర్గామాత

నిడదవోలు: శరన్నవరాత్ర మహోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఐదో రోజు సోమవారం అమ్మవారు మహాచండీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో కొలువైన కనకదుర్గమ్మ శ్రీదేవి, శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు చేశారు.

గోపాలపురం: స్థానిక గుడ్డిగూడెం రోడ్డులోని యర్రం పల్లమ్మ తల్లి గుడి వద్ద సోమవారం చండీయాగం నిర్వహించారు. ఆలయ నిర్మాత పిన్నన గంగారావు దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య చండీ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఉండ్రాజవరం: మోర్తలోని విజయ కనకదుర్గమ్మ, పాలంగి కనకదుర్గమ్మ, చిలకపాడు దుర్గమ్మ వార్లు మహాచండీదేవి ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పాలంగి కనకదుర్గమ్మ ఆలయంలో నృత్య కళాకారిణి ఖ్యాతిదేవి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

దేవరపల్లి: స్థానిక మూడుబొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికను మహా చండీదేవిగా అలంకరించి, భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయం వద్ద మహాచండీ హోమం నిర్వహించారు.

కొవ్వూరు: మండలంలోని వాడపల్లిలో కొలువైన దుర్గాదేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సోమవారం గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, వివిధ రకాల శక్తి వేషాలతో అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. శక్తి వేషదారుడి తలపైన, రెండు చేతులపై నిప్పుల మంటలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



వాడపల్లి దుర్గాదేవి ఊరేగింపులో శక్తి వేషం



మహాచండీదేవిగా నిడదవోలు స్టేషన్ రోడ్డులోని దుర్గామాత

డిగ్రీలో మేనేజ్‌మెంట్ కోటా అడ్మిషన్‌కు 14 వరకూ గడువు

కొవ్వూరు: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ఫస్టియర్‌లో చేరే విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ కోసం ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ, మేనేజ్‌మెంట్ కోటాలో చేరేందుకు ఈనెల 14 వరకూ గడువు ఇచ్చినట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సుబ్బారావు సోమవారం తెలిపారు. ఇంటర్ మీడియట్, తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు బీఎస్సీ, బీకాం గ్రూపుల్లో చేరేందుకు అవకాశం కల్పించారన్నారు. వివరాల కోసం 98664 08009, 94402 43509 నంబర్లను సంప్రతించాలని ఆయన కోరారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసన

కొవ్వూరు: పలు వామపక్ష పార్టీల పిలుపు మేరకు సోమవారం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం పాలస్తీనాకు సంఘీభావదినం పాటించామని ఆ పార్టీ నాయకుడు పాత కోకల నాగేశ్వరరావు తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ, ఇతర ప్రజా సంఘాల నాయకులు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపాయి. అనంతరం ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేశారు. ప్రపంచ శాంతి కోసం ఈ యుద్ధ నివారణలో భారతదేశం జోక్యం చేసుకోవాలని కోరారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ, ఐఎఫ్‌టీయూ నాయకులు ఈమని గ్రీష్మకుమార్, ఈమని మల్లిక, పి.నాగమణి, పీడీఎస్‌యూ నాయకులు ఎస్ఎస్‌వీ మహర్షి, బి.మణిందర్ తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రకు వచ్చిన కడప జిల్లా విద్యార్థులు

గోపాలపురం: కడప జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులు సుమారు 500 మంది విజ్ఞాన విహార యాత్రలో భాగంగా సోమవారం గోపాలపురం చేరుకున్నారు. స్వర్ణాంధ్ర విజన్ –2047లో భాగంగా వారందరూ కడప నుంచి అరకు వరకూ విహారయాత్ర చేపట్టారు. ఈ నెల 4న ప్రారంభమైన వారి విహారయాత్ర 11వ తేదీ వరకూ కొనసాగుతుంది. వారు ఇప్పటి వరకూ శ్రీహరికోట, ప్రకాశం బ్యారేజ్ వంటి ప్రాంతాలను సందర్శించారు. ఇకపై పోలవరం ప్రాజెక్టు, యానాం, రిషికొండ బీచ్, అరకు సందర్శించనున్నట్టు వారి వెంట ఉన్న విద్యాశాఖ అధికారి బి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జి శ్రీనివాసరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి, సీఆర్పీ కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు

పరిష్కార వేదికకు 12 అర్జీలు



కొవ్వూరులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి 12 అర్జీలు అందాయని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. వాటిలో ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీలు, మండల పరిషత్‌కు సంబంధించి మూడేసి చొప్పున అర్జీలు ఉన్నాయని తెలిపారు. డీఆర్డీఏ, మునిసిపాలిటీ, పోలీసులకు సంబంధించిన సమస్యలపై ఒక్కొక్కటి చొప్పున అర్జీ అందినట్టు వివరించారు. ఆర్డీవో కార్యాలయం ఏవో జవహర్ బాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీపీ వీరాస్వామి

చాగల్లు: స్వర్ణాంధ్ర–2047 కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ చాగల్లు మండల అభివృద్ధి కోసం షుగర్ ఫ్యాక్టరీ, చేపల చెరువులు, పరిశ్రమలు, బస్సు, ట్రైన్ సౌకర్యం, మార్కెట్లలో ఏర్పాట్లు మొదలైన అంశాలపై ప్రణాళిక తీసుకున్నామన్నారు. వర్క్‌షాప్‌లో తహసీల్దార్ ఎం.మెరికమ్మ, ఈఓపీఆర్డీ ఆర్. శ్రవణ్ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కమర్షియల్ బ్యాంక్ డీడీలకూ అనుమతి

నిడదవోలు: మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల నుంచి కమర్షియల్ షెడ్యూల్డ్ బ్యాంకు, సీఎఫ్ఎంఎస్ డీడీలను కూడా అనుమతిస్తున్నట్టు నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్. జయరాం సతీష్‌బాబు సోమవారం తెలిపారు. మద్యం షాపుల కేటాయింపునకు రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో ఈనెల 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీస్తారన్నారు. మద్యం షాపుల కోసం నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 284 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో నిడదవోలు టౌన్ నుంచి 61, నిడదవోలు రూరల్ మండలం నుంచి 63, ఉండ్రాజవరం మండలం నుంచి 87, పెరవలి మండలం నుంచి 73 దరఖాస్తులు వచ్చినట్టు సీఐ సతీష్‌బాబు వివరించారు.

స్పేస్ సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్ పోటీలో తపస్విరెడ్డి ప్రతిభ



జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న తపస్విరెడ్డి

నిడదవోలు: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను పురస్కరించుకుని భీమవరం విష్ణు పాఠశాలలో సోమవారం ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించిన స్పేస్ సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్‌లో పట్టణానికి చెందిన విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి స్పేస్ సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్ పోటీలో ద్వితీయ స్థానం, స్పేస్ క్విజ్ పోటీలో తృతీయ స్థానం సాధించాడు. పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా తపస్విరెడ్డి బహుమతి అందుకున్నాడు. ఈసందర్భంగా తపస్విరెడ్డిని పలువురు అభినందించారు .